అభివృద్ధి పనులకు రూ.5.45 కోట్ల నిధులు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్

కుత్బుల్లాపూర్: కొంపల్లి పురపాలక సంఘం కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో అన్ని వార్డుల్లో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.5. 45 కోట్ల నిధులు కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, వివిధ వార్డుల్లో రోడ్ల మరమ్మతులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, కల్వర్టులు, ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పోల్స్, వాటి మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, జడ్పీహెచ్‌ఎస్‌లో వంటశాల నిర్మాణం, పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాట్లు తదితర పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు చైర్మన్ తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీహరి, వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

వైకుంఠధామం స్థల కబ్జాపై ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న ఆకుల సతీష్ తదితరులు

నిజాంపేట్: నిజాంపేట్‌లో వైకుంఠధామానికి చెందిన ఎకరం స్థలాన్ని కబ్జా చేశారని బీజేపీ నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ అధ్యక్షుడు సతీష్ బాచుపల్లి డిప్యూటీ తహసీల్దార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాంపేట్ కార్పొరేషన్ ఏర్పడిన మొదటి కౌన్సిల్ మీటింగ్‌లో వైకుంఠ ధామానికి సర్వే నంబర్ 233/22, 23లో ఐదు ఎకరాలకుపైగా స్థలాన్ని కేటాయించి రూ.1.5 కోట్ల నిధులతో పనులు చేపట్టారన్నారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్న తరుణంలో ఓ ప్రైవేట్ వ్యక్తి రెవెన్యూ అధికారులు జారీ చేసిన ఎన్‌ఓసీతో కోర్టును ఆశ్రయించాడని, అప్పటి నుండి అధికారులు కౌంటర్ దాఖలు చేయకపోవడంతో ఎకరా స్థలం కబ్జా కోరల్లో చిక్కుకుందన్నారు. దీనిపై అధికారులు సమగ్ర సర్వే చేపట్టి తక్షణమే ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించి 19 ప్లాట్లకు ఇచ్చిన ఎన్‌ఓసీని రద్దు చేసి, ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అరుణ్ రావు, సుధాకర్ రెడ్డి, కవితారెడ్డి, రమేష్, అశోక్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ అభినందనీయం


మల్లయ్యను సన్మానిస్తున్న ఎంఈఓ

రంగారెడ్డినగర్: జితేందర్ హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని కుత్బుల్లాపూర్ మండల విద్యాధికారి జెమిని కుమారి అన్నారు. గురుమూర్తి నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో వారం రోజులుగా విద్యార్థులకు కొనసాగుతున్న చేతిరాత శిక్షణను శుక్రవారం పరిశీలించారు. హ్యాండ్ రైటింగ్ సంస్థ డైరెక్టర్ వంపు మల్లయ్యను సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చేతిరాత బాగుంటే పరీక్షల్లో మరింతగా రాణించవచ్చని, విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రయ్య, పీఆర్‌టీయూఎస్ జాయింట్ సెక్రటరీ రాఘవేందర్ రెడ్డి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుదర్శన్, ఉపాధ్యాయులు ధనరాజ్, దివ్య, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ గృహ నిర్బంధం


ఎమ్మెల్యే వివేకానంద్‌ను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

కుత్బుల్లాపూర్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులను పోలీసులు శుక్రవారం గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు నివాళులర్పించే స్వేచ్ఛను సైతం రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా కోర్టులో కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని వారు హెచ్చరించారు.



పేరుకే పెద్ద బస్తీ

కైసర్‌నగర్‌లో రోడ్లు, డ్రైనేజీ లేక ప్రజలకు తిప్పలు

- మురుగు నీటితో దర్శనమిస్తున్న రోడ్లు
- పట్టించుకోని అధికారులు

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ కైసర్ నగర్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. డివిజన్‌లోనే అతిపెద్ద బస్తీగా గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్ పేరొందింది. సయ్యద్ రెహమాన్ అనే వ్యక్తి 30 ఏళ్ల క్రితం ఈ బస్తీని 80 గజాల ప్లాట్లుగా చేసి స్థాపించాడు. 44వ జాతీయ రహదారి, షాపూర్‌నగర్, గాజులరామారం, గండి మైసమ్మ మియాపూర్ రోడ్డును కలిపి వాహనాలు కైసర్ నగర్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఈ రోడ్డు నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. గుడిసెలతో మొదలైన ఆ బస్తీ దినదినాభివృద్ధి చెందుతుంది. దీంతో పాటు పదింతల జనాభా పెరిగింది. కానీ మౌలిక సదుపాయాలు అంతగా లేకపోవడంతో బస్తీ వాసులకు ఇబ్బందులు తప్పడం లేదు.


ఇళ్ల మధ్య నుంచి పారుతున్న మురుగు


ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని విధంగా ఉన్న మట్టి రోడ్డు

ప్రధాన సమస్య డ్రైనేజీ, రోడ్లు

కైసర్ నగర్‌లో 75 రోడ్లు ఉండగా.. కేవలం 4 ప్రధాన రోడ్లలో మాత్రమే సీసీ రోడ్డు ఉంది. మిగతా రోడ్లు మట్టి రోడ్లే. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఏ రోడ్డులో చూసిన ఇళ్ల మధ్య నుంచి 24 గంటల పాటు పారుతున్న డ్రైనేజీ దర్శనమిస్తుంది. దీనికి తోడుగా సీసీ రోడ్డు లేకపోవడంతో చినుకు పడిందంటే చాలు రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. ఈ విషయమై గతంలో అధికారులు పలుమార్లు వచ్చి చూశారే తప్ప సదుపాయాలు కల్పించిన పాపను పోలేదు.

ఇళ్ల మధ్యే మురుగు



మౌలిక సదుపాయాలు కల్పించాలని కార్యాలయాల చుట్టూ అనేకసార్లు తిరిగాం. అధికారులు వచ్చి చూడటమే తప్పా పట్టించుకునే పాపన పోలేదు. ఇక్కడ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మధ్యనే నిత్యం మురుగు ప్రవహిస్తూనే ఉంటుంది. దీంతో దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని రోడ్లు, డ్రైనేజీ వసతులు కల్పించాలి.
– బాలకృష్ణ, కైసర్ నగర్

20 ఏళ్లుగా అలాగే ఉంది



20 ఏళ్ల క్రితం ఈ బస్తీకి వచ్చాం. మా చుట్టు పక్కల బస్తీలు మారుతున్నాయి తప్ప కైసర్ నగర్ మారడం లేదు. ఇంత వరకు రోడ్డు లేకపోవడంతో వర్షం పడితే నీళ్లు ఇళ్లలోకి వస్తున్నాయి. ఓట్ల సమయంలో వచ్చే నాయకులకు మా బాధలు కనిపించవా?. ఇప్పటికైనా అధికారులు బస్తీని బాగు చేయాలి.
– రహీమా బేగం, కైసర్ నగర్.

త్వరలో పరిష్కరిస్తాం



రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలపై తమ సిబ్బందితో ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నాం. చాలా వరకు పరిష్కారం చేశాం. కైసర్ నగర్ ప్రజల ఇబ్బందులు మాకు తెలుసు. నిధులు రాగానే మొట్టమొదటగా అక్కడ వెచ్చించి సమస్యలు పరిష్కరిస్తాం.
– మల్లారెడ్డి, గాజులరామారం ఉప కమిషనర్

రుక్మిణి ఎస్టేట్‌లో అయ్యప్ప పడిపూజ

కుత్బుల్లాపూర్: రుక్మిణి ఎస్టేట్‌లో శంకర్‌రావు గురుస్వామి, ప్రవీణ్ గురుస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం అయ్యప్ప స్వామి మహా పడిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీసీసీ మాజీ అధ్యక్షులు ప్రతాప్ హాజరయ్యారు. కార్యక్రమంలో బాబు, గజపతి, దుర్గారావు, పవన్, సూరి, డాక్టర్ అరుణ్ కుమార్, మనీష్, అంజి, రితిక్, ఆకాష్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం



జీడిమెట్ల: చదువుకునే విద్యార్థికి ఆర్థిక సహాయం అందించడం సంతృప్తినిస్తుందని ఎర్ర అనూష అన్నారు. లోకేష్ అనే వైద్య విద్యార్థి సిద్దిపేటలోని సురభి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగవ సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థికి అనూష ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం శుక్రవారం రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో మూడే రవినాయక్, వైనాల ప్రభాకర్, కరుణాకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో సర్వతోముఖాభివృద్ధి


ప్రజాపాలన విజయోత్సవాల్లో పాల్గొన్న కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి దిశగా పయనిస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం సూరారం కృషి కాలనీలో జరిగిన సంబురాలకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల తప్పుడు ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని, కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారంటీల అమలు దిగ్విజయంగా కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి, సామేల్, నర్సాగౌడ్, గుంజ శ్రీనివాస్, చాంద్ పాషా, గోపాల్, నాగిరెడ్డి, అంజిరెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంటీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా శ్రీశైలంగౌడ్


శ్రీశైలంగౌడ్‌ను అభినందిస్తున్న యూనియన్ నాయకులు

కుత్బుల్లాపూర్: హిందూస్తాన్ మెషిన్ టూల్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ఘన విజయం సాధించారు. శుక్రవారం జరిగిన ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ తరఫున బరిలో నిలిచిన శ్రీశైలంగౌడ్ తెలంగాణ యూనియన్ సుదర్శన్‌రావుపై విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌ఎంటీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. యూనియన్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, సత్యనారాయణ, శ్రీహరి, లక్ష్మణ్, శ్రీనివాస్ నాయక్, లచ్చయ్య, కేశవ చారి, రవీంద్ర కుమార్, మోహన్ రెడ్డి, రాంబాబు, అంజయ్య, కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు యూనిఫాం అందజేత


యూనిఫాం అందజేస్తున్న కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ తదితరులు

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని నేతాజీ కాలనీ, శివశంకర్ నగర్ కాలనీ, జింకలవాడలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ చిన్నారులకు శుక్రవారం యూనిఫాంలను పంపిణీ చేశారు. చిన్నారులకు కావలసిన పలకలు, బ్యాగ్స్‌లను కూడా తన సొంత నిధులతో అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ శోభారాణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాళ్లు స్రవంతి, రేణుక, నాయకులు కంచి భిక్షపతి బాగయ్య, రాజు, సురేష్, ఆనంద్ గౌడ్, గోపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై ఐక్యంగా పోరాడాలి

హెచ్‌సీయూ వీసీ ప్రొ.బీజేరావు

రాయదుర్గం: డ్రగ్స్ రహిత సమాజం కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో రూపొందించిన పోస్టర్లను వీసీ శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థల్లో డ్రగ్స్ సంస్కృతికి దూరంగా ఉండాలన్నారు. ఇటీవల సమాజంలో డ్రగ్స్ వాడకం పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇది సామాజిక దురాగతాలకు దారితీస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ డ్రగ్స్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్ మాట్లాడుతూ డ్రగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి కృష్ణయ్య మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ సెల్ త్వరలో తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో సహకారంతో అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌సీయూ అధికారులు, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు మరువలేనివి

వర్ధంతి సందర్భంగా నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆయా సంఘాలు

అంబేడ్కర్ సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరువరని వక్తలు కొనియాడారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ వ్యాప్తంగా అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగంలో అన్ని వర్గాల ప్రజలకు సముచిత స్థానం, హక్కులు కల్పించిన మహనీయుడు అంబేడ్కర్ అని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. –రంగారెడ్డినగర్


సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


కొంపల్లిలో.. నివాళులర్పిస్తున్న జెమ్మి దేవేందర్


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దళిత చైతన్య కళామండలి అధ్యక్షుడు సీవీ రత్నం


బాచుపల్లి తెలుగు యూనివర్సిటీ ప్రాంగణంలో నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ నిత్యానందరావు


జగద్గిరిగుట్టలో.. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్


సంజయ్‌గాంధీ నగర్‌లో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు..

వడ్డెరుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్యే వివేకానంద్‌గౌడ్

కుత్బుల్లాపూర్: వడ్డెర కులస్తుల న్యాయమైన డిమాండ్లను అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు ఆధ్వర్యంలో సంఘం నాయకులు ఎమ్మెల్యేను కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. వడ్డెర కులానికి చెందిన విద్యార్థులకు ఎంట్రన్స్ లేకుండా గురుకులాల్లో సీట్లు కేటాయించాలని, క్వారీలు, క్రషర్లపై వడ్డెర కులస్తులకే పూర్తి హక్కులు కల్పించేలా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పీట్ల మల్లేష్, వడ్డెర సంఘం సభ్యులు జెరిపేట రాములు, శ్రీను, యాది, హన్మంతు, రాజు, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో సీమంతాలు.. అన్నప్రాసన


అన్నప్రాసనలో సీడీపీఓ రేణుక తదితరులు

కుత్బుల్లాపూర్: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా శుక్రవారం సీడీపీఓ రేణుక ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ సెక్టార్ అంబేడ్కర్ నగర్ కమిటీ హాల్‌లో సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత సమస్య తలెత్తకుండా అంగన్‌వాడీల్లో ఇచ్చే గుడ్లు, బలమైన ఆహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సీడీపీఓ సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యమ్మ, టీచర్లు భవానీ, శ్రీలక్ష్మి, శైలజ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి


ఎన్నికైన వారిని సన్మానిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన నాయకులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. శుక్రవారం యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైన పొన్నం తరుణ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మక్ అజయ్ శ్రీశైలంగౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శ్రీశైలంగౌడ్ సత్కరించారు. కార్యక్రమంలో కూన రాఘవేంద్రగౌడ్, వినోద్, క్రాంతి, నాగరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి


షాపూర్‌నగర్‌లో జెండా ఎగురవేసిన పార్టీ నాయకులు

జీడిమెట్ల: సీపీఎం జిల్లా మహాసభలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయని, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని శుభం హోటల్ సమీపంలో ఉన్న లేబర్ అడ్డా వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. ప్రగతినగర్‌లోని పుచ్చలపల్లి లీలా సుందరయ్య ఫంక్షన్‌హాల్‌లో సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

11న ఆలయంలో పూజలు

జగద్గిరిగుట్ట: వైకుంఠ ఏకాదశి సందర్భంగా జీడిమెట్ల డిపో సమీపంలోని నల్లగుట్ట లక్ష్మీనరసింహ్మా స్వామి ఆలయంలో ఈ నెల 11న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఉదయం అభిషేకం, సహస్రనామ అర్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

రిజిస్ట్రార్‌పై మహిళా ప్రొఫెసర్ ఫిర్యాదు

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమానికి హాజరు కాకుండా గేటు వద్ద తనను అడ్డుకుని అవమానించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్ డైరెక్టర్, ప్రొఫెసర్ వసుమతి శుక్రవారం ఫిర్యాదు చేశారు. రిజిస్ట్రార్ వల్లే పోలీసులు, జేఎన్‌టీయూహెచ్ సెక్యూరిటీ తనను అడ్డుకున్నారన్నారు. రెక్టార్ విజయకుమార్ రెడ్డి స్పందించడంతో తనను అనుమతించారన్నారు. ఈ విషయమై రిజిస్ట్రార్ వెంకటేశ్వరావు స్పందించారు. ప్రొఫెసర్ వసుమతి పోలీసులకు ఐడీ కార్డు చూపకపోవడంతో అడ్డుకున్నారని, జేఎన్‌టీయూ సెక్యూరిటీ గమనించి లోపలకు అనుమతించాలని పోలీసులకు తెలిపారని చెప్పారు. ఆలోగా రెక్టార్ కూడా స్పందించారని తెలిపారు. కావాలని ఎవరూ అడ్డుకోలేదని మీడియాకు వివరించారు.

తాను పాఠాలు చెప్పిన పాఠశాలలో ఓ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు తన 84వ పుట్టినరోజును జరుపుకున్నారు. సూరారం కాలనీకి చెందిన కోలా ఈశ్వరయ్య ప్రభుత్వ రిటైర్డ్ హెడ్‌మాస్టర్ గతంలో సూరారం జడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహించారు. శుక్రవారం అతని పుట్టినరోజును విద్యార్థుల సమక్షంలో జరుపుకొని, పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, స్కేల్, పెన్సిల్, జామెంట్రీ బాక్సులు అందజేశారు. – సుభాష్‌నగర్

